

# అత్త-భర్త-భయంకరమ్మాయి

కందుకూరి రాజకుమారి

''సార్!'' అరిచినట్టున్న ఆ పిలుపుకి ఉలిక్కి పడి కళ్ళు తెరిచాడు వామనరావు.

అప్పటికింకా వెలుతురు రాలేదు. సమయం సుమారు అయిదు గంటలు కావచ్చు.

''సార్, సార్!'' మళ్ళీ అదే కేక!

ఆ గొంతు గెస్ట్ హౌస్ వాచ్‌మన్ అబ్బులుది. వామనరావు ఆ గెస్ట్‌హౌస్‌కి మేనేజర్.

''ఏమయింది అబ్బులూ?'' రొటీన్‌గా ప్రశ్నించాడు కానీ అతనికింకా నిద్రమత్తు దిగినట్టు లేదు.

''సార్ నిన్న మన గెస్ట్ హౌస్‌లో దిగినారు కదా, రమణరావు బాబు..''

''అవును.''

''ఆయనెంత కొట్టినా తలుపు తీయట్లేదు సార్!''

''ఆయన్ను కొడితే తలుపెందుకు తీస్తాడు- తలుపుని కొట్టాలి గానీ..''

''అదికాదు సార్, ఆయన గదిలో తలుపేసుకుని పడుకున్నారు..తలుపు కొడితే తీయట్లేదు..''

''రాత్రి బాగా తాగాడుగా - మాంచి నిద్దట్లో వుండుంటాడులే! ఓ రెండు గంటల తర్వాత అయితే లేవచ్చు. అయినా ఇప్పుడు ఆయనతో నీకేం పని?''

రమణరావు హెడ్డాఫీసునుంచి అప్పుడప్పుడు తనిఖీకి వస్తుంటాడు. అతనికి పెద్దగా చదువు లేకపోయినా, వాళ్ళనీ వీళ్ళనీ- అందితే జుట్టు, అందకపోతే కాళ్ళూ పట్టుకుని- ఉద్యోగం సంపాదించుకున్నాడని టాక్. తమకంటే చిన్న వయసులో, తమకంటే తక్కువ చదువుతో, తమకంటే పెద్దపోస్టులో వున్న రమణరావంటే, వామనరావులాంటి వాళ్ళ కంటగింపును ఈ టాక్ ఊరట పరుస్తూంటుంది. వాళ్ళు దాన్ని మనస్ఫూర్తిగా నమ్మి ప్రచారం చేస్తూంటారు.

ఆ టాక్‌లో ఎంతోకొంత నిజం లేకపోలేదు! రమణ రావు తల్లి రాజమ్మకామాత్రం లింకు చాలు కొడుక్కు ద్యోగం సంపాదించి పెట్టడానికి!!

''సార్'' ఆలోచనల్లోంచి బయటపడేశాడు అబ్బులు వామనరావుని, ''నిన్న రాత్రి అంతా వెళ్ళిపోయాకా కూడా రమణరావు బాబుగారు తాగుతూనే వున్నారు సార్''

మేనేజర్ శ్రద్ధగా విన్నా వినకపోయినా చెప్పడం తన డ్యూటీ కాబట్టి చెప్పుకుంటూ పోతున్నాడు అబ్బులు.

''ఆ తాగుడు మత్తులో ఏమేమో మాట్లాడారట సార్!''

''ఇందులో కొత్తేముంది?''

''మాట్లాడిన విషయం కొత్తదే సార్''

''ఏమిటది?'' అని అడుగుతాడేమోనని ఆగి, అడగకపోయినా కంటిన్యూ అయిపోయాడు.

''ఆయన అసిస్టెంట్ చెప్పాడు, ఆయన ఈరోజు పొద్దున్నే విషం తాగి చచ్చిపోతారట సార్! నన్నెవ్వరూ ఆపద్దు అని కూడా చెప్పారట సార్!''

''ఆహాఁ! మరింకా ఆ శుభవార్త ఎవరి చెవినా పడలేదేమిటి, తెల్లారింది కదా!''

''నేనది చెబుదామనే వచ్చాను సార్!'' అన్నాడు అబ్బులు 'శుభవార్త' అన్న పదాన్ని అవాయిడ్ చేస్తూ.

''రాత్రి నాతో ఈ విషయం చెప్పి నన్ను చూస్తుండమని అసిస్టెంటుగారు పడుకున్నారు సార్. రమణరావు బాబుగారు కిటికీ తలుపు తీసే పడుకున్నారు. నేను గంటగంటకీ ఆయన్ను చూస్తూనే వున్నాను. నాలుగు దాటాక చిన్న కునుకుపట్టేసింది. పది నిమిషాల క్రితం పెద్ద చప్పుడయింది. బాబుగారి కిటికీ తలుపు మూసుంది. తలుపు కొట్టాను కానీ జవాబులేదు.'' ఊపిరి పీల్చుకున్నాడు అబ్బులు.

అతడు చెప్పవలసిందింకా వుందేమోనని భయపడుతూ, ''మరా అసిస్టెంటుని లేపకపోయావ్..'' అన్న వామనరావు మాట పూర్తికాకుండానే అసిస్టెంటు పరుగున వచ్చాడు. అతడి చేతిలో ఒక కాగితం వుంది.

'సూయిసైడ్ నోటు గామోసు' పైకనలేదు వామనరావు.

అసిస్టెంటు హడావుడిగా చాలా మాట్లాడాడు. ఆ మాటల సారాంశం ఇది. రమణరావు గదిలో పెద్ద చప్పుడు వినిపించడంతో వాచ్‌మన్ అబ్బులు అసిస్టెంటుని లేపాడు. అసిస్టెంటు కూడా కాసేపు తలుపు కొట్టగా ఆ తలుపు వూడొచ్చేసింది. లోపల రమణరావు మంచంమీద అడ్డంగా పడున్నాడు. మంచం పక్కగా వున్న టేబుల్ మీద ఒక ఖాళీసీసా, దానికింద వామనరావు సూయిసైడ్ నోటు అనుకున్న కాగితం వున్నాయి.

వామనరావు ఆ కాగితం తెరిచి చదివాడు.

''గొప్ప సంప్రదాయమైన కుటుంబంలో పుట్టిన నేనిలా ఎందుకు చేసానో అందరూ తెలుసుకోవాలి. ఈ వుత్తరం అందగానే అంబులెన్సూ పోలీసులతో బాటు 'ఏ? టీవీ' న్యూస్ చానెల్‌కు కూడా ఫోనుచేసి మా ఇంటి అడ్రస్‌కి పిలిపించగలరు. నేనింతకంటే ఇంకేమీ కోరుకోను. మా అమ్మ రాజమ్మగారు మిగతా విషయాలు టీవీ వాళ్ళకు చెబుతారు. నేనింకా బతికే అవకాశాలున్నాయి గనక వెంటనే హాస్పిటల్‌కి ఫోను చేయండి. – ఇట్లు రమణరావు''

అసిస్టెంట్ వామనరావు ఇంట్లోని ఫోను వైపు పరిగెత్తాడు.

****

''ఓరి నాయనో! ఎంత పని చేశావురా! పెద్దదాన్ని, నాతో ఒక్క మాటయినా చెప్పచ్చు గదా! నేనేమయినా సలహా ఇచ్చేదాన్ని.. దానికెలాగోలాగ నచ్చజెప్పేదాన్ని గదా! వాడి ప్రాణాలు తీసుకున్నావుగదే ముద నష్టపుదానా! నాకు ముందే తెలుసు ఇదంత పనీ చేస్తుందనీ...వాడు నా మాట వింటేనా.. ఇప్పుడు నాకు దిక్కెవ్వరు?...నన్ను దిక్కులేనిదాన్ని చేశావుగదే దిక్కుమాలిన దానా.. అక్కడికీ నేను చెప్పానండీ వాడికి! అందరూ చూస్తూండగా ఆ విషమేదో తాగేడవమని. వాడికంత తెలివెక్కడిది? మొహమాటం! అందుకే అది అలా ఆడించింది.. ఆఖరికిదిగో.. నా కడుపేగా.. కాలింది.. అయ్యో దేవుడా! నా పూజలకి నువ్విచ్చే ఫలితం ఇదా...'' రాజమ్మ రోదన అంతు లేకుండా సాగిపోతూనే వుంది. బంధువులూ, చుట్టుపక్కల వాళ్ళూ, అంతా ఆమె చుట్టూచేరి ఊరుకోపెడుతున్నారు.

''పాపం! ఈ వయసులో ఎంత కష్టమొచ్చింది రాజమ్మగారికీ...'' అనుకుంటున్నారు వారంతా. అప్పుడే అక్కడికో పెద్దవాన్ వచ్చి ఆగింది. అందులోంచీ ఒక బృందం బయటకొచ్చింది. వాళ్ళలో అందరికంటే ముందు ఒక అందమైన అమ్మాయి నడుస్తోంది. పట్టులాంటి జుట్టును, పోనీటైల్‌లో బంధించింది. పాపిడి జిగ్‌జాగ్ ఆకారంలో వుంది. తీర్చిదిద్దబడిన కనుబొమ్మల కింద ఒక లైట్ షేడ్. కనురెప్పలకి మస్కారా, కనులపైన ఐ లైనర్. బుగ్గలకు గులాబి రంగు బ్లష్. పెదాలకు ఎర్రటి లిప్‌స్టిక్. ఫార్మల్ ట్రౌజర్స్ వేసుకున్న ఆమె చేతిలో మైక్! ఆ మైక్ పైన 'ఏ? టీవీ న్యూస్' అని రాసుంది. ఆ అమ్మాయికి కాస్త వెనుకగా వీడియో కెమెరాతో ఓ స్మార్ట్ కుర్రవాడు, మరి కాస్త వెనుకగా షూటింగుకవసరమైన పరికరాలతో మొత్తం సిబ్బంది!

వారిని చూడగానే రాజమ్మ, ''పోనీలే ఇదైనా గుర్తుపెట్టుకున్నాడు'' అని పైకే అంది కానీ ఆమె చుట్టూవున్న వాళ్ళు వినిపించుకోవడం లేదు. వాళ్ళంతా పెదాలపై చిరునవ్వులలంకరించుకుని, (ఎందుకైనా మంచిదని) కెమేరా వైపే చూడసాగారు.

''ఎక్స్‌క్యూజ్ మీ. మేము 'ఏ టీవీ న్యూస్' నుంచి వస్తున్నామండి...'' అని చుట్టూ చూసేసరికి అక్కడ రాజమ్మ కనిపించలేదు. రాజమ్మే కాదు, అక్కడాడవాళ్ళంతా కూడా మాయమయిపోయారు.

''ఇఖడ ఆంటీలంతా ఏఖడా? మేమ్ స్టోరీ ఛేద్దామని వచ్చామ్...'' అందా ఇంగ్లీషు బట్టలు వేసుకున్న తెలుగు వార్తావనిత.

''ఒక్క గంట ఓపిక పట్టమ్మా, అందరూ వచ్చేస్తారు..'' ఎవరో చెప్పారు.

''డియర్ ఆంటీస్, మేమ్ 'ఏటీవీ' న్యూస్ ఛానెల్ నుంచి వఛ్ఛామ్. మేమ్ ఇఖ్ఖడ వన్ అవర్ ఖంతే ఎఖువ టైమ్ స్పెండ్ ఛేయలేమ్ సో మీరంథా వెంతనే...''

వార్తావనిత మాట పూర్తయ్యే లోపే ఆమె ఖల్లు – సారీ– కళ్ళు జిగిల్‌మనేంత మెరుపు మెరిసింది. ఆడవాళ్ళంతా ఎవరి స్థానాల్లో వారు ప్రత్యక్షమయ్యారు, కానీ చిన్న మార్పు!

అందరూ ఖరీదైన చీరల్లో, వంటినిండా నగలతో వున్నారు. రాజమ్మగారి చేతిలో అదనంగా ఒక అందమైన మ్యాచింగ్ సిల్కు రుమాలుంది. దానితో ఆవిడ అప్పుడప్పుడూ కళ్లొత్తుకుంటోంది. మిగతా ఆడవాళ్ళంతా చేతికున్న గాజులు కనబడేలా ఆమెను ఓదారుస్తున్నారు.


వారిలో ఒకావిడ మాత్రం ముఖంతప్ప మరేమీ కెమెరాకందకుండా జాగ్రత్తపడుతోంది. ఆవిడ రాజమ్మకు దూరపు బంధువు. పక్క ఊరినుండి రాజమ్మను పరామర్శిద్దామని వచ్చింది. సందర్భం కాదేమోననుకుని మామూలు చీరతో వచ్చేసింది. పాపం– వేరే మంచి చీరలేమీ తెచ్చుకోలేదు!

వార్తావనిత రాజమ్మగారి ముందు మైక్ పెట్టింది...



## తోడు కోసం...

తోడు నీడ లాంటిదని ఊరికే అంటారా. నలుపుంటేనే కదా తెలుపు విలువ తెలిసేది. అందుకే ఒంటరిగా వుంటోన్న విద్యాబాలన్‌కి ఇప్పుడు తోడుకావాలని పరితపిస్తోందిట. మొన్నటి వరకూ జాన్ అబ్రహామ్‌తో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన విద్యా... ఆయన కాస్త బిపాషా ఒత్తిడికి తలొంచి ఈమెతో తిరగడం మానేశాడు. తోడు విలువ తెలుసుకున్న విద్యకు ఆయన వెళ్ళాక తెలిసింది. స్టాండ్‌బై కాకుండా స్టాండర్డ్ క్యాండిడేట్‌ను పట్టాలని చూస్తోందని పుకార్లు వస్తున్నాయి. అదే విషయాన్ని విద్యాబాలన్‌ని అడిగితే, ఉలిక్కిపడినట్టు చూసి, నాకెందుకూ తోడు అంటూ అడిగిన వారివైపే చూస్తోంది ఏమీ తెలియని అమాయకపు హీరోయిన్‌లా. అన్నీ తెలిసిన వాళ్లు అలాగే వుంటారు మరి!




''నాపేరు రాజమ్మగారు. మా నాన్న ఆ కాలంలో పెద్దాఫీసరు. మాకు చాలా ఆస్థులుండేవి. నాకు చాలా మంచి మంచి సంబంధాలొచ్చాయి. మాది చాలా సంద్రాయమైన కుటుంబం. మావారు అప్పట్లో నన్ను ప్రేమించి...''

''భామ్మగారూ- సారీ! మేమ్ మీ డీటైల్స్ ఏదీ అడ ఘట్లేదు. మీ అభాయి...''

''ఇదిగో అమ్మాయ్! నా వయసు యాభై ఏళ్ళే! నన్ను మరీ బామ్మగారు అనేయకు, ఆంటీ అని స్టైల్‌గా పిలు బాగుంటుంది.''

''ఓఖే భామ్మగా.. సారీ ఆంటీ, మీరు నిజ్జంఘా చాలా ఖలఖలలాడుథున్నారు...''

''ఏదో...అందరూ అలాగే అంటారు నన్ను'' ఆంటీ.. అదే..రాజమ్మ కొద్దిగా సిగ్గుపడింది.

''ఇంథకీ ఆంఠీ! ఏమ్ ఝరిగింది?''

''నా కొడుకు ( తిట్టో, బూతు పదమో కాదు. నిజంగా ఆవిడ కొడుకే) మా కోడలు చేసిన అవ మానం భరించలేక నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. మాదసలే సంప్రదాయమైన కుటుంబం! ఇప్పుడు వాడు ఆసుపత్రిలో చావుబతు కుల మధ్య వున్నాడు...''

''అంతే మీ అభాయింఖా ఛావలేదన్నమాట. ఆత్మ హత్య ఖోసం ౠై చేసాడు..''

''ఏదో ఒకటి నా బతుకు బండలయిపోయింది కదా! ఇప్పుడు వాడు బాగుపడి ఇంటికొచ్చేదాకా నాకె వరు దిక్కు? అదేమో దాని దారది చూసుకుంది. వాడి ప్పుడు వెనక్కొచ్చాక వాడికెవరు చేసి పెడతారు? పెద్దదాన్ని, నా పనులు నేనే చేసుకోలేను! ఇక వాడికె క్కడ చేయగలను? పోనీ ఏ మనిషినయినా పెట్టు కుందామంటే, పేపర్లలో ఎన్ని వార్తలు చూడట్లేదు- ఎవరయినా తల పగలగొట్టినా దిక్కులేదు. నేనొక్క దాన్నే వుంటా.. అప్పటికీ నేను చెబుతూనే వున్నా - సుబ్బరంగా ఫ్లాటు కొనరా సేఫ్టీగా వుంటుందని...అది పడనిస్తేనా! ఇండిపెండెంట్ హౌస్ అంటూ ఈ మూలకి లాక్కొచ్చింది. అయినా ఆ రాక్షసికి నేనంటే పడదు. నేనేం చెప్పినా సాగనివ్వ దు...'' ఆగకుండా చెప్పుకుంటూ పోతోంది రాజమ్మ.

గడ్డిమేట్లో సూది వెదకడం వార్తావనితకు అల వాటే - ఆ ఆశతోనే ఆమె రాజమ్మ వాగ్ధాటికి అడ్డురా లేదు.

''ఇంటెడు చాకిరీ నేనే చేస్తాను. అదేం పట్టించు కోదు. నా కొడుకు ( ఇదీ తిట్టు కాదు) తన జీతం చాల ట్లేదని దాన్ని ఉద్యోగం చేయమని అడిగాడు. వాడిని చిన్నబుచ్చాలని కాకపోతే వాడికంటే ఎక్కువ జీతం వచ్చే జాబే సంపాదించాలా! నేనప్పుడే చెప్పేశాను, ఏదో ఉద్యోగం చేస్తున్నానుకదా అని నీ కొడుక్కి ( ఈ పదాన్నింకా చాలాసార్లు ప్రయోగిస్తుందీవిడ. నేను చెప్పేదాకా అది తిట్టు కాదనే అనుకోండి) ఇంటిపని చెబితే ఊరుకునేది లేదని. మాది చాలా సంప్రదాయ మైన కుటుంబం. మగవాళ్ళు ఇంటిపని చేయడం మా ఇంటా వంటా లేదు!

''పొద్దున్న ఆరింటికెళ్ళి ఎప్పుడో రాత్రి తొమ్మిది గంటలకొస్తుంది. ఆఫీసు చాలా దూరమట. తనకు, పిల్లలకు బాక్సులు సర్దుతుందే తప్ప నా మొహాన కాఫీ చుక్కయినా పోయదు. నాకని హాట్‌పాక్‌లో ఇన్ని చపాతీలు చేసి పారేస్తుందిలే. రోజూ తినలేక విసుగొస్తోందనుకో! మధ్యాన్నమప్పుడు ఏదైనా చిరు తిళ్ళు నమలాలనిపిస్తుందంటే- బయిట్నించి కొని తెచ్చి నా మొహాన కొడుతుందే తప్ప చచ్చినా ఇంట్లో చేయదు.

''పనిమనిషి చేత ఇంటెడుపని చేయించేసరికి పెద్ద దాన్ని కదా చాలా ఆయాసమొస్తుంది. దానికేం తెలుసు? హాయిగా ఏసీ ఆఫీసులో కూర్చుని నన్ను రాచి రంపాన పెడుతుంది. అయినా నేనేమీ అనను. అన్నా అది పడుతుందా! పెద్దదాన్ని, ఓ మాటంటే తప్పులేదు కదా! నువ్వయినా చెప్పమ్మాయ్...'' ఓ క్షణం ఆగిందావిడ.

ఈ పాజ్‌ను పూర్తిగా సద్వినియోగపరుచు కుంటూ వార్తావనిత మైక్ తన వైపుకు తిప్పుకుంది.

''అయితే బామ్.. సారీ ఆంఠీ.. ఇంతఖా ఆ రాక్షసి...సారీ మీ ఖోడలు- ఏం చేసిందని మీ అభా యి..?''

''అదా- నేను చెప్పా కదా! మాది చాలా సంప్రదా యమైన కుటుంబం. ఆ రాక్షసి -నా కొడుక్కి విడా కుల నోటీసు పంపించింది.''

''అదిసరేగానీ ఆంఠీ..మీ పేరేమన్నారు?''

''రాజమ్మగారు...''

''అలాఘే 'రాఝుమ్మఘారు' ఘారూ...''

''అన్ని గారులు లేవు, ఒకటే...''

''అలాగే ఆంఠీ, (నాకిదే ఈజీగా వుంది) ఇంథకీ అంఖుల్, అదే, మీ వారు ఎఖడా కనిపించట్లేదు, హాస్పిటల్‌లో మీ అభాయి వధ వున్నారా?''

రాజమ్మకు దుఃఖం ఆగలేదు. ఒకసారి గట్టిగా ముక్కు చీదింది. ''ఆయనెప్పుడో నన్నొంటరి దాన్ని చేసి వెళ్లిపోయారు. అందుకేగా నాకీ గతి పట్టింది!''

''ఓ సారీ! మెరిసే కుంఖుమభొట్టుతో ఖళఖళలా ఢుతున్న మిమ్మల్ని ఛూసి...''

రాజమ్మగారు మళ్ళీ వెంటనే అందుకుంది, ''ఆc- ఈ కాలంలో అవన్నీ ఎవరు పాటిస్తున్నారు! మాది సంప్రదాయమైన కుటుంబం అని చెప్పానుకదా, ఆయన తర్వాత నా కొడుకు మాటే నాకు వేదవాక్కు. వాడు, 'అమ్మా- నువ్వు ఎప్పటిలా రంగుచీరలు కట్టు కుంటూ, బొట్టూ, కాటుకా, గాజులూ అన్నీ పెట్టుకో వాలి' అని చెప్పాడు. నాకు పెద్దగా సరదా లేకపో యినా, వాడి కోసం ఇలా తయారవ్వలిసొస్తోంది! ఇప్పుడు ఆ రాక్షసి మూలంగా నాకిన్ని కష్టాలొ చ్చాయి. పెద్దదాన్ని, నాకు దిక్కెవరు?''

''మీ ఖోడలు డైవోర్సు ఎంధుకు ఖోరిందో ఛెప్తా రా?''

''నా కొడుకు (మనకు తిట్టే, ఆవిడక్కాకదు) తాగు తాడు. అందులో తప్పేముంది? వాడు సంపాదించు కుంటాడు, తాగుతాడు. అది వాడిని నిలదీస్తుందా! అందుకే చేయి చేసుకున్నాడు. మాది చాలా సంప్రదా యమైన కుటుంబం. ఆడది మగవాడిని ప్రశ్నించడం చాలా తప్పు!

''ఆ రాక్షసి అంతటితో ఆగిందా, వాడిని తిరిగి కొట్టింది. పాపం తాగున్నాడేమో, కిందపడి ఇక లేవ లేదు. అప్పుడు ఇక ఉండబట్టలేక నేను దాని చెంప ఛెళ్ళుమనిపించాను. అప్పుడది నన్నేన్నేసి మాటలంద నుకున్నావ్? ఇంటిని తన బోడి ముప్ఫైవేల సంపాదన తోనే నడిపిస్తోందట. మరి మా వాడికి నెలకు పదిహే నువేలొస్తుంది తెలుసా!

''మేము కట్నం తీసుకున్నామట. అది మన సంప్ర దాయం కాదా! పెద్దదాన్ని నన్నంతలేసి మాటలంటే ఊరుకుంటానా! నీకిష్టం లేకపోతే ఇంట్లోంచీ పొమ్మన్నా! అప్పుడదేమందో తెలుసా! ఇల్లు తనదట. తనకి లోన్నిస్తే ఇల్లు కొన్నారట!

''అప్పుడే మావాడు లేస్తున్నాడు, ఆ మాటలకి తట్టుకోలేకపోయాడు. పాపం. మగవాడు! తల్లిని అంతలేసి మాటలంటూంటే ఊరుకోగలడా? దాన్నీ పిల్లల్నీ - మెడపట్టుకుని బయిటకు గెంటేసాడు. దుక్కల్లా బలిసున్నారేమో- అలా చేసినందుకు పాపం వాడికి చెయ్యి బాగా నొప్పి చేసింది కూడా!''

''అయిథే ఫైనల్‌గా ఆ 'నా ఖొడుకు' (పాపం, ఇదామె స్పందన. ప్రసారంలో సెన్సార్ చేస్తుందిలెండి )...సారీ ...మీ అభాయి గారి సూయిసైడ్ అటెంప్ట్‌క్కూడా ఖరణమ్ 'అది'... ఐ మీన్ మీ ఖోడలు డైవోర్సు నోటీస్ పంపఢమేనంతారు..''

''అవునమ్మా చక్కగా చెప్పావు, చలాకీగా మాట్లా డుతున్నావు, స్టైల్‌గా వున్నావు (నీకు జీతం కూడా బాగానే వస్తూంటుంది!). నువ్వు నాకు బాగా నచ్చావు. నా కొడుకు తిరిగొచ్చేకా ఎలాగూ ఆ రాక్షసి నుండి విడాకులు తీసుకుంటాం...అప్పుడు నువ్వు నా కోడలు కారాదూ? నిన్ను బాగా చూసుకుంటాం.. మాది చాలా సంప్రదాయమైన కుటుంబం..'' అంటూ ఇంకా ఏదో చెప్పబోతున్నదల్లా ఉన్నట్లుండి ఆశ్చర్యంగా '' ఆc??!'' అంటూ నోరు తెరిచేసింది రాజమ్మగారు. అందుక్కారణం- అప్పటిదాకా ఆమె ఎదురుగా మైక్ పట్టుకుని నిలబడి వున్న ఆ అందాల వార్తావనిత ఉన్నఫళంగా మాయమైపోవడమే!!! ★